# "చిగురుటాకు"

(కథానిక)

ఎస్. యం. సుభాని

నిర్విరామంగా ఒక పగలు ఒక రాత్రి ప్రయాణం చేసి, కొడుకును శానిటోరియం జేర్పించాలని వచ్చాడు సారథి. వెంట అతనిభార్య, అనసూయ కూడా వచ్చింది. శానిటోరియం ఆవరణలో అడుగుపెట్టగానే సారథి కొక విధమైన తృప్తికలిగింది. ఆ చల్లగాలికి సేద తీర్చుకున్నట్లనిపించింది. కొడుకునూ భార్యనూ వెంటబెట్టుకొని ఆఫీసు దగ్గరికొచ్చాడు సారథి.

"ఎప్పుడు ఉత్తరం వ్రాశారు? ఏ వార్డు ఇచ్చినట్టు తెల్పారు? టెలిగ్రాం ఇచ్చిరా?" మొదలగు ప్రశ్నలువేసింది నర్సు. సారథి ఒక్కదానికి కూడా సమాధానం చెప్పలేకపోయాడు. ముందుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపలేదు. అటువంటప్పుడు ఏం చెప్తాడు. అసలు, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని కూడా తెలియదు. అంతవరకు కుర్రవాడికి మందిస్తున్న డాక్టరును అడిగాడు. కేసు చేజారిపోతున్నదనే దుగ్ధవల్ల అతనేమీ చెప్పలేదు. "చచ్చిందాకా ఉంటె వెళ్ళిచేస్తాన"న్నట్లు, తుదిదాక ఉంటేనయమౌతుందని ఇంతకాలం గడిపాడు. కుర్రవాని వ్యాధిమాత్రం ఏమీ తగ్గలేదు. డబ్బుకుడబ్బు కాలానికి కాలం-రెండూ వృధాఅయినై! ఆఖరుకు ఒక మహానుభావుడి సలహాపై కొట్లోఉన్న రెండు కుట్టుమిషన్లూ అమ్మేసి కుర్రవాణ్ణి తీసుకొని వచ్చేశాడు. ఎలాగైనా కొడుకును జనరల్ వార్డులో జేర్పించాలన్న విషయంతప్ప, శానిటోరియంకి సంబంధించిన విషయాల్లో ఇంకొకటి తెలియదతనికి తెలుసుకునే అవకాశమేలేదు. నర్సు, సరైన సమాధానం లభించకపోయేటప్పటికి అతనిని ఒక సారి నిశితంగా పరికించి లోనికి వెళ్ళిపోయింది.

సారథికిదంతా అయోమయంగా ఉన్నది. తన "గోడు" ఆ నర్సుతో చెప్పుకుందామన్నా తగిన అవకాశం లభించలేదు. ఏంచేయాలా అని ఒకసారి చుట్టూ పరికించి చూసేలోగా నర్సు తిరిగివచ్చింది. ఎక్సరేలాబు దగ్గరికెళ్ళి చీటిపుచ్చుకుని లాబులో గళ్లా యిచ్చి రక్తమివ్వమని చెప్పి వెళ్ళింది. "లాబులోగళ్లాయిచ్చి" రక్తమివ్వట మేమిటో సారథి కర్థంకాలేదు. అడిగి తెలుసుకుందామని నోరు తెరిచేలోగానె నర్సమ్మ పాతచెప్పులు ఈడ్చుకుంటూ వెళ్ళిపోయింది. అదేదో ఎక్సరేల్లాబుదగ్గర తెలుసుకుందామని కుర్రవాణ్ణి తీసుకుని వెళ్ళాడు.

ఎక్సరేల్లాబుదగ్గర ఫొటోలు తీసే అతను సారథినిచూచి "ఏవూరుమంది" అంటూ గర్జించినంత పనిచేశాడు. ఒక్కక్షణం సారథి అతని ముఖం పరకాయించి చూశాడు. అతనెవరో ఆంధ్రుడేనన్న నమ్మకం కలిగింది. ఆ దూరదేశంలో తోటి ఆంధ్రుడొకడుంటే చాలుననుకున్నాడేమో అతనికేదో బరువు తీరినట్లనిపించింది. దానితో కొండంత ఉత్సాహం కూడ కలిగింది. సారథి ఉత్సాహంచూసి అతను ఆశ్చర్యపోయాడు.

"బాబు, నేను ఆంధ్రుణ్ణి ఇందాక ఆఫీసుదగ్గర ఒకనర్సమ్మతో మాట్లాడాను. ఆమె సరిగా మాట్లాడనేలేదు. ఇక్కడి సంగతులు నాకు తెలియవు. కుర్రవాణ్ణి పిల్చుకొచ్చాను జనరల్ వార్డులో జేర్పించాలని ఏంచేయాలో నాకు తెలియదు. తమరు దయచేసి వివరాలు చెప్పండి" అన్నాడు.

ఎక్సరేటెక్నిషియను ఒక్కక్షణం ఆలోచించాడు. సారథి యొక్క అమాయకత్వం, ఉత్సాహం అతని లోని సహృదయతను మేల్కొలిపినై.

"మీరు మెడికల్ సూపర్నెంటుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారా?" అని అడిగాడతను.

"లేదండి, ఆ విషయం నాకు తెలియలేదు. ఈమధ్య ఒక స్నేహితుడు కన్పించి ఇక్కడ జేర్చమని సలహాయిచ్చాడు. వచ్చేముందు కుర్రవాడికి మందిచ్చిన డాక్టరును అడిగాను. ఆ మహానుభావుడు ఏమిచెప్పలేదు."

"మరి ఎలా, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపకుండావచ్చి జనరల్ వార్డులో బెడ్ కావాలంటే

దొరుకుతుందా? స్పెషల్ వార్డు ఇస్తారు. అందులో ఉండండి."

"వాటికెంత కట్టాలి?"

"రకాలున్నవి. నూటపది, అరవై, రెండొందల ముప్ఫయి, నాలుగు వందల..."

ఆ టెక్నీషియను మాటలు పూర్తిచేయక ముందే-"బాబు నన్నుచూసి మీరేమనుకున్నారో, నేనొక ట్రైలరును. పైకి తెల్లబట్టలు కట్టినంత మాత్రాన ఏమున్నది. ఉన్న రెండు మిషన్లూ అమ్ముకుని కుర్రవాని కొరకు బయల్దేరి వచ్చాను. ఆ స్పెషల్ వార్డులో మాబోటి వాళ్ళకు కావు. జనరల్ వార్డులు బెడ్ లభించే విధానంచెప్పి పుణ్యం కట్టుకొండి" అన్నాడు సారథి!

"ట్రైలర"న్న శబ్దంవిని "ఆరి మవ్వా!" అన్నట్లు చూశాడా టెక్నీషియన్. "సరే ప్రయత్నించు, నీ అదృష్టమెలా ఉన్నదో" నంటూ చీటివ్రాసి యిచ్చి, లాబరేటరికెళ్ళి కళ్ళై, రక్తం పరీక్షకిచ్చి రమ్మన్నాడు.

"మీ అదృష్టమెలా ఉందో" వన్నమాటల్లోని అనౌచిత్యం అతనికి పట్టలేదు. అతనాలోచించాడు. అదృష్టమెలా ఉన్నదో ప్రయత్నించటమంటే దానిలోని యథార్థం అతనికి తెలుసు. ఇంతవరకూ అతని అదృష్ట తీసికట్టుగానే ఉన్నది. కనీసం ఈ విషయంలోనైనా తనను అదృష్టవంతునిగా చేయమని మనసులోనే ప్రార్థించాడు.

సారథి కుర్రవానిని లాబరేటరీకి తీసుకవెళ్ళి కళ్ళైరక్తం ఇచ్చివచ్చాడు. తిరిగివచ్చిన కాసేపటికి ఒక డాక్టరువచ్చి పరీక్షచేసి స్క్రీనింగ్ చేశాడు. ఆ డాక్టరేమైనా చెప్తాడేమోనని ఆశగాచూశాడు అతని ముఖంలోకి అతనేమీ చెప్పలేదు. టెక్నిషియనును అడిగితే మెడికల్ సూపర్నెంటును కలుసుకుని మాట్లాడమన్నాడు.

స్క్రీనింగ్ వగైరాలన్నీ పూర్తయేటప్పటికి పొద్దు నడినెత్తికొచ్చింది. కుర్రవాడు డీలుపడి నకనకలాడ్తున్నాడు. అతనితీరుచూస్తే జ్వరంబాగా వచ్చినట్లున్నది. భర్త ఆందోళన చూస్తుచూస్తు ఏమి మాట్లాడేందుకు మనస్కరించలేదు అనసూయకు. సారథి ఆఫీసుదగ్గరికెళ్ళాడు. 'దొరగారు' లేరని తెలిసింది. సాయంకాలమో రేపో వస్తాడని తెలుసుకున్న సారథికి నడుము విరిగినంతపనైంది. ఒకసారి చెట్టుక్రింద కూర్చున్న భార్యాబిడ్డల్ని చూశాడు. అనసూయ పొద్దుట్నుంచి పచ్చిమంచినీళ్ళన్నా పుచ్చుకోలేదు. కుర్రవాడు సరేసరి, జోగుతున్నాడు. రోగిష్టి కొడుకును చూస్తుండగానే సారథి కళ్ళలో నీళ్ళుతిరిగినై. ప్రక్కనున్న ఒకవ్యక్తినడిగి తెలుసుకుని శానిటోరియం బయటనున్న సత్రానికి పిల్చుకెళ్ళాడు. శానిటోరియంలో జేరటానికివచ్చి, జేరకుండా ఉండవలసి వచ్చిన రోజులుండేందుకు కట్టారీ సత్రం. వెంటనే సారథి అన్నం పట్టుకు వచ్చాడు హోటలునుండి. కుర్రవాడుతిన్న పిడికెడు మెతుకులుపోగా మిగిలిన కారేజిభోజనం ఇద్దరికి ఎక్కువయింది.

అనసూయ భర్తను అడిగింది ఏమైందని. ఏం చెప్తాడు? ఉన్నసంగతి తెలియజేశాడు. అతనికి కొంచెంకొంచెం అర్థమవుతున్నది, ఉత్తరప్రత్యుత్తరాలు జరుపకుండా రావటంలోని లోపం. తెలిసి ఉంటే అలాగే ముందుగా సంప్రతించి ఉండేవాడు. తీరా ఇక్కడికొచ్చిన తరువాతచూస్తే జనరల్ వార్డులో బెడ్ దొరుకుతుందో లేదోననే శంక ఏర్పడింది. ఎవరైనా మనప్రాంతంవాళ్లుంటే మాట్లాడివస్తానని బయలుదేరాడు సారథి.

పైపంచె భుజానవేసుకుని వెళ్తున్న భర్తవైపు ఒకసారి క్రిందదుప్పటిపై నిద్రిస్తున్న రోగిష్టి పుత్రుడివైపు ఒకసారి చూసింది అనసూయ. ఆమె హృదయంలో దుఃఖం మెలికలు తిరిగింది. కళ్ళుతుడ్చుకుని లేచి గిన్నెలవిసర్ది కుర్రవానిపక్కన కూర్చుని విసరసాగింది. క్షణానికొకరకంగా ఆమె ఆలోచనలు పరిపరివిధాల పోయినై.

శానిటోరియం నాలుగువైపులా ఒకసారి తిరిగి వచ్చాడు సారథి. అది రెస్టు సమయం. మాట్లాడేందుకు తగినవ్యక్తి అతనికి కన్పించలేదు. రోగులంతా పడుకొని ఉన్నారు. కాలం అలాగే గడచిపోయింది. సాయంకాలం ఆఫీసుదగ్గరకెళ్తే దొర వచ్చాడని తెలిసింది. దొరను ఎలా కల్సుకొని మాట్లాడటమో అతనికి అర్థంకాలేదు. పక్కనే ఉన్న జవానుతో చెప్పాడు. ఆ జవాను పలుకు బంగారమైపోయింది. గత్యంతరంలేక అతనిచేతిలో ఒకపావలాకాసు పెట్టే అతనువెళ్ళి గుమస్తాను పిల్చుకొచ్చాడు. ఆ గుమస్తా వివరాలన్నీ తెలుసుకుని లోనికెళ్ళివచ్చి నూటఅరవై రూపాయల వార్డు

యిస్తామన్నాడు. సారధి దొరగారితో మాట్లాడ్తా నంటే దయదల్చి పిల్చుకెళ్ళాడు లోనికి.

దొరగారు సారధి నమస్కారానికి జవాబివ్వ కుండానే కూర్చోమన్నట్లు సంజ్ఞ చేశారు. ఒక్క క్షణం తటపటాయించి సారధి కుర్చీలో కూర్చు న్నాడు. ఏమిటో చెప్పమన్నట్లు చూశారు దొర గారు సారధివైపు. సారధి తన 'గోడు' వినిపిం చాడు. అంతా విని నూటఅరవై రూపాయల వార్డు తీసుకోమన్నాడు దొర.

సారధికా విధానం నచ్చలేదు. నచ్చక చేసే దేమీలేదు. మనసుకు కష్టం కలిగింది. అతను చెప్పాడు "బాబూ నాకొక్కడే కుమారుడు. నేను క్లైలర్ని. ఉన్న రెండుమిషన్లు అమ్మివచ్చాను. తమరు దయదల్చి జనరల్ వార్డులో బెడ్ ఇవ్వాలి."

దొరగారు ఒక్కక్షణం ఆలోచించి నూటపది రూపాయవార్డు యిస్తామన్నారు. సారధి భరించలే నన్నాడు. దొరగారు లాభంలేదంటూ ఏదో రెండుకాగితాలు అతనిముందు, టేబిల్ పైన పడేసి వెళ్ళిపోయారు. గుమస్తా ఆ రెండుకాగితాలు అతని చేతికిచ్చి స్వయంగా తలుపుతీసి సాగనంపాడు బయటికి.

సారధి ఆ కాగితాలవైపు ఒకసారి చూశాడు. వాటిలో కుర్రవాని వ్యాధినిగురించిన వివరా లున్నవి. సారధి బయలుదేరాడు. శానిటోరియంలో ఉన్న ఆంధ్రసమితి కార్యదర్శిని కలుసుకున్నాడు. అతనితో విషయమంతా చెప్పాడు.

"చూశావటోయ్ మధు" అన్నాడా కార్యదర్శి ప్రక్కనున్న వ్యక్తి నుద్దేశించి. ఆ యువకుడొక చిరునవ్వు నవ్వాడు.

"నవ్వుతావేమిటి, చూడు పాపం ఆయన ఎలా బాధపడుతున్నాడో" అన్నాడు.

"నవ్వక ఏంచేయమంటావు. అన్నిటికన్నా అది తేలికగా చేయగలపని. ఏడవగలిగితే బాగానే ఉంటుంది. కాని మనకింత దుర్గతి పట్టినా ఏడ్పు రాదు. ఆ కాగితాలిలా ఇవ్వండి చూద్దాం" అని కాగితాలు తీసుకున్నాడు మధు.

ఆ కాగితాలలో, ఊపిరితిత్తుల స్కెచ్ గీసి వ్యాధిగల ప్రదేశాని గుర్తుపెట్టారు. ఎడమభాగంలో పైన ఒక 'కావిటి' ఉన్నది. కొన్ని చుక్కలున్నవి. కుడిభాగం బాగానే ఉన్నదికాని ఎడమభాగంలో ఉన్న 'కావిటీ'కొంచెం పెద్దదిగా ఉన్నది. ఆ వివ రాలన్నీ చూసి కాగికాలు సారధికిచ్చాడు మధు.

"మీ అబ్బాయికి వ్యాధి ఒకప్రక్కనే ఉన్నది. రెండో ప్రక్క బాగున్నది. ఇక్కడ రెండువైపుల 'కావిటి' లున్నవాళ్ళున్నారు. యిటువంటివాళ్ళకు సీట్లు దొరుకుతవి. కాని మీకు దొరకదు. వ్యాధి ఉధృతంగాఉండి చస్తారనుకున్న వాళ్ళకు జనరల్ వార్డులో బెడ్ దొరుకుతుంది. వాళ్ళదగ్గర డబ్బుం టుంది, పలుకుబడి ఉంటుంది. మీదగ్గర ఈరెండూ లేవు. మీ కుర్రవాడికి బెడ్ దొరకదు...మీరు కూడ ఏ జక్రయ్య దగ్గర్నుంచో రికమండేషన్ తెస్తే మీకూ బెడ్ దొరికేది. ఇప్పటికిప్పుడు ఖాళీ లేకున్నా క్రాస్ బెడ్ వేసి చేర్చుకునేవాళ్ళు మీరు ఆ జక్రయ్యల ముఠాకు చెందినవారుకారు. కనీసం వాళ్ళ రికమండేషనన్నా లేదు మీదగ్గర. మీకు బెడ్ దొరకదు. ఇదీ ప్రపంచం" మధు ఏదో అర్థంకాని బాధతో చెప్పాడు.

"ఐతే ఇప్పుడేం చేయమంటారు?" సారధి మాటల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

"ఇక్కడ మీరు చేయగలిగిందేమీలేదు. వాళ్ళు పట్టినపట్టు విడవరు. వారు చెప్పినట్లు పేరు రిజి ష్టర్ చేయించుకొని ఇంటికి వెళ్ళండి. అక్కడే వీళ్ళు చెప్పిన మందులిప్పించండి. రెండుమూడు నెలల తర్వాత పిలిపిస్తారు. ఈలోపుగా నెలకొక సారో, మూడు వారాల కొకసారో వాళ్ళకు ఉత్తరంవ్రాసి కనుక్కుంటూండండి."

"కుర్రవాడు చాల బలహీనంగా ఉన్నాడు జ్వరంకూడ ఎక్కువగా వస్తున్నది. ఎటుపోయి ఏటు వస్తుందో, మరీ నిన్న ప్రయాణంవలన దిగ జారి పోయినట్లున్నది ఆరోగ్యం."

"అంతకన్నా వేరే గత్యంతరంలేదు. పదండి ఒకసారి మీ అబ్బాయిని చూసివస్తాం."

ఆంధ్రసమితి కార్యదర్శి, మధు, ఇద్దరూ సారధి వెంట బయలుదేరారు. అక్కడ సత్రంలో ఒకప్రక్క కుర్రవాడు దుప్పటి పరచుకొని పడిఉన్నాడు. కుర్రవానికి తొమ్మిదో పదో సంవత్సరాలుంటై. బాగా చిక్కిపోయి ఉన్నాడు. అనసూయ కుర్ర వాని పక్కనే కూర్చుని విసురుతూన్నది. కుర్రవాడు అప్పుడప్పుడు మూలుగుతున్నాడు. జ్వరం ఎలా ఉన్నదని ప్రశ్నించాడు సారధి. నూటమూడు

ఉన్నదన్నది. ఆంధ్రసమితి కార్యదర్శి ఒకసారి మధు ముఖంలోకి చూశాడు. మధుమాత్రం తదేక దృష్టితో కుర్రవాణ్ణి చూస్తు బిరువుగానిట్టూర్చాడు.

"టైం అయింది ఇక్కడ మీకు దీపంకూడా లేదనుకుంటా మా వార్డుకు వెళ్దాంరండి." అని మధు బయలుదేరాడు.

వార్డుకు తీసుకవెళ్ళి ఒక దీపం, కూజాతో మంచినీళ్ళు, ఇచ్చి మనిషిద్వారా పంపాడు. సారధి ఏం మాట్లాడలేదు. అతనినిచూస్తే అర్థమవుతుంది. అతను లోపల్లోపల చాల బాధపడుతున్నాడు. ఎంతో ఆశతో వచ్చాడు. బెడ్ దొరకలేదు. మధు ధైర్యంగా ఉండమని చెప్పిపంపాడు.

రాత్రి ఎనిమిదిన్నర దాటింది కుర్రవాడికి అన్నం పెట్టే ఏమీ తినలేకపోయాడు. జ్వరం ఎక్కువగా ఉన్నది. కాసినిపాలు తెచ్చియిచ్చాడు సారధి. రెండు గుటకేసి ఆపైన తాగలేక క్రింద పెట్టేశాడు. కుర్రవాణ్ణి పడుకోపెట్టి అనసూయ సారధి కన్నం వడ్డించింది. సారధి అన్నం తింటుండగా కుర్రవానికి దగ్గు తెరవచ్చింది దగ్గుతోబాటు రక్తం పడింది. అనసూయ హడలిపోయి 'అమ్మో' అన్నది, సారధి కుర్రవానిదగ్గర కొచ్చాడు. అనసూయ కుర్రవానిని లేపి వీపుకానుకుని పట్టుకున్నది. దగ్గు వచ్చినప్పుడెల్లా రక్తం పడుతూనే ఉన్నది. ఇంతవరకు ఎప్పుడూ ఇలా జరగలేదు. సారధి ధైర్యంకూడ దిగజారింది. అనసూయ సరే సరి; కన్నీళ్ళు కారుస్తూ కూర్చున్నది. సారధి ఆమెకు ధైర్యంచెప్పి మధుదగ్గరకు పరిగెత్తాడు.

మధు విషయమంతా తెలుసుకుని, పేషంట్ల నియమాన్ని ఉల్లంఘించి డ్యూటీ డాక్టరుదగ్గరి కెళ్ళాడు సారధిని వెంటపెట్టుకుని డాక్టర్ అప్పుడే బయలుదేర బోతున్నాడు. మధునుచూచి ఆశ్చర్య పోయాడు. మధు విషయమంతా చెప్పాడు.

"డాక్టర్, ఇతనొక టైలరు కుర్రవాణ్ణి జనరల్ వార్డులో జేర్పించాలని వచ్చాడు. దురదృష్ట వశాత్తు బెడ్ ఇవ్వలేదు. ఒక్కడే కొడుకు. వ్యాధి 'ఏక్టివ్'గా ఉన్నదట. ఇప్పుడా పిల్లవానికి 'హెమాప్టిసిస్' వచ్చింది. వీలైనంత సహాయం చేయాలి మీరు. ఇతని ఆవేదనచూసి మానవ ధర్మాన్ని విస్మరించలేక వచ్చాను. మీరు క్షమించాలి." అన్నాడు.

డాక్టర్ కూడ యువకుడు. సారధిముఖం చూస్తూనే అర్థం చేసుకున్నాడు అతని బాధ. వెంటనే మధును వార్డుకుపంపి సారధిని తీసుకుని వెళ్ళాడు కుర్రవాణ్ణి చూశాడు. ఇంకా రక్తం పడుతూనే ఉన్నది. చాలా ఉధృతంగా ఉన్నది సారధిని అక్కడే ఉంచి డాక్టర్ ఆఫీసుకు వచ్చాడు. ఫోనులో మెడికల్ సూపర్నెంటుతో మాట్లాడి కుర్రవాణ్ణి ఆపరేషన్ బ్లాకులో జేర్పించేందుకు కంపౌండరును పంపాడు. కంపౌండరు స్ట్రెచర్ పట్టించుకెళ్ళి పిల్లవానిని ఆపరేషన్ బ్లాకులో జేర్పించాడు.

సారధి పెట్టె, పక్క చుట్టి తీసుకెళ్ళి మధు వార్డులో పెట్టాడు. కుర్రవాణ్ణి ఆపరేషన్ బ్లాకుకు తీసుకునివెళ్ళారని వినగానే మధు గుండె గతుకుమన్నది. "ఎమర్జన్సీ" కేసుల్లోకాని పేషంట్లను ఆపరేషన్ బ్లాకుకు తీసుకువెళ్ళారు.ఏదోభయంతో మధు మనసులో విచారం పేరుకున్నది. పైకి సారధితో ఏమీ చెప్పకుండా అదే తగ్గిపోతుందని ధైర్యంచెప్పి పంపాడు.

సారధి ఆపరేషన్ బ్లాకుకువచ్చాడు. అనసూయ గది బయట కూర్చుని ఏడుస్తున్నది. గది తలుపులు వేసి ఉన్నవి. కిటికీ పైరెక్కలు తెరచిఉంటే దాని గుండా చూశాడు సారధి. నర్సు, కంపౌండరు ఇద్దరు డాక్టర్లు ఉన్నారు. కుర్రవానికి స్పృహ ఉన్నదో లేదో అర్థంకాలేదు.

సారధి గుండె బరువెక్కింది. అజ్ఞాతభయంతో తల్లిగిల్లిపోతున్నాడు. అనసూయ మాటా మంతీ లేకుండా కూర్చుని కన్నీరు కారుస్తున్నది. క్షణమొక యుగంగా గడుస్తున్నట్లున్నది ... బహుళ ద్వాదశి చీకట్లు చుట్టూ దట్టంగా వ్యాపించి ఉన్నది. వాతావరణం నిశ్శబ్దంగా ఉన్నది. గది లోంచి మాటలు అస్పష్టంగా వినిపిస్తూ ఆందోళనను చాటుతున్నై. ఇంతలో గదిలోనుంచి "అమ్మా!" అనే శబ్దం వినిపించింది. "బాబూ" అంటూ ఆక్రోశించింది అనసూయ. గదిలో అలజడి యెక్కువైంది. తలుపు తెరచుకుని డాక్టర్లు బయటికి వచ్చేశాడు. నర్సు అనసూయ దగ్గరకొచ్చి ఆమెకు ధైర్యం చెపుతూ లోనికి తీసుకుని వెళ్ళింది. మంచం మీద పడిఉన్న కొడుకుని చూసి "అయ్యో నా

బాబు..." అంటూ వెనకనే వస్తున్న సారథి చేతుల్లో విరుచుక పడిపోయింది అనసూయ.

· అంతా ముగిసిపోయింది.

సాయంకాలం ఆఫీసుల్లో డబ్బు కట్టేందుకు వెళ్ళాడు సారథి మెడికల్ సూపర్నెంటు చూసి 'సోసారీ మిష్టర్ సారథీ' అంటూ తన విచారాన్ని ప్రకటించాడు!

"విచారించటంవలన ప్రయోజన మేముంది డాక్టర్‌గారూ... సకాలంలో కుర్రవాణ్ణి జేర్చుకుంటే ఎలా ఉండేదో మీలో నిద్రాణమైవున్న మనుష్య ప్రకృతిని నేను మేల్కొల్పలేక పోయాను అయినా ఆఖరి క్షణంలో నా కుర్రవాని కొరకు మీరు ఏదో కొంత చేశారు. దానికి ధన్యవాదాలు."

చేతులు జోడించి నమస్కారంపెట్టి కన్నీళ్ళాపుకుంటూ వెళ్ళాడు సారథి. మెడికల్ సూపర్నెంటు, కొడుకు పోయినందుకు విచారం ప్రకటించాడు, పాపం అనుకున్నాడు.

ఆ రాత్రే అనసూయను తీసుకుని ప్రయాణమయ్యాడు సారథి. శూన్యహృదయంతో అనసూయ ప్లాట్‌ఫారంమీద గానుగచెట్టుక్రింద కూర్చున్నది. సారథి అక్కడే నిల్చుని ఉన్నాడు. అనసూయ బాధ బాధగాదు... ఇంతవరకు ఓదార్పుగా ఒక్కమాట పల్కలేదు సారథి. ఎలా ఓదార్చాలో అతని పితృహృదయానికి అర్థంకాలేదు. ఓదార్చినంత మాత్రాన తగ్గేదా ఇది? కార్చిచ్చు.

"అనసూ" అన్నాడు సారథి.

అనసూయ తలెత్తి చూసింది. సారథి దుఃఖిస్తున్నాడు. రెండుచేతులతో ముఖంకప్పుకుని బావురుమన్నది అనసూయ. సారథి చేతితో ఆమె తల నిమురుతున్నాడు. వాళ్ళ హృదయ కుటీరంలో మాదిరిగానే చుట్టూ కటికచీకటి ఆవరించి ఉన్నది. స్టేషన్‌మాష్టర్ రూంలోంచి వెలుతురు మందంగా ప్రసరిస్తున్నది. అనసూయను ఓదార్చాలనుకున్న సారథి ఏడుస్తున్నాడు. అతని కన్నీళ్లు జలజలరాలినై. ఎక్కణ్ణుంచో ఒక చిగురుటాకుకూడా రాలిపడిపోయింది.

---

ఆంధ్ర రాజకీయాలలో

# కమ్యూనిస్టులు - పి. ఎస్. పి.

సి. రాజగోపాలాచారి

ఎన్నికలలో పొత్తుకొరకై ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ మద్దుకూరి చంద్రశేఖర రావుగారికి, ఆంధ్రప్రజా సోషలిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ పి. వి. జి. రాజుగారికీ జరిగిన సంప్రతింపుల వివరాలను తెలియజేస్తూ, వారిరువురి మధ్య నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలను యిటీవల ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ విడుదల చేసింది. యీనెల 5వ తేదీన గుంటూరులో మాట్లాడుతూ, ఎన్నికలలో కాంగ్రెసు విజయానికి కారణం ఎన్నికల ఒడంబడికల విషయములో కమ్యూనిస్టుల దూరదృష్టి రహిత వైఖరే కారణమని ప్రజా సోషలిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ పి.వి జి. రాజుగారు చేసిన విమర్శకు సమాధానంగా యీవుత్తర ప్రత్యుత్తరాలను విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ, ఎవరిచర్యలు అభివృద్ధి నిరోధకశక్తుల విజయానికి కారణమో ఆంధ్రప్రజలే నిర్ణయించాలని 'అతి అమాయకంగా' ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ కోరింది.

అవిశ్వాస తీర్మాన ఫలితముగా నవంబరు 7వ తేదీన మంత్రివర్గం పతనమయిన తర్వాత ప్రత్యామ్నాయ ప్రభుత్వమనే పేరుతో మరొక అస్థిరమైన, అతుకులబొంత ప్రభుత్వాన్నేర్పాటు చేయడానికి కమ్యూనిస్టులుచేసిన ప్రయత్నాలతో సహకరించకుండా, పతనమయిన ప్రభుత్వచర్యలను విమర్శించి, తీర్పునిచ్చే బాధ్యత ఆంధ్ర ప్రజలకే వదలటం సమంజసమని భావించి ప్రజాసోషలిస్టుపార్టీ 'శాసన సభను రద్దుచేసి, కొత్త ఎన్నికలకు వుత్తరవునీయవలసినదిగా' గవర్నరును కోరింది. తత్ఫలితముగా కమ్యూనిస్టుల ప్రయత్నాలు వమ్ముకావటం సంభవించింది. మరొకసారి శాంతియుతముగా నాలోచించుకొని, సుస్థిర ప్రభుత్వము నేర్పాటు